

ఇంటింటా సోలార్ వెలుగులు

కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రతి ఇంటికి సోలార్ ప్లేట్లను సరఫరా చేయడం ద్వారా 300 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇవ్వనుంది - 8లో



కాళహస్తిలో కన్నప్పకే తొలిపూజ

భక్త కన్నప్పకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో జరిగే బ్రహ్మోత్సవాలలో తొలి పూజలు చేస్తున్నారంటే ఆయన భక్తి ఏపాటితో అర్థమవుతోంది. - 8లో

గరిష్టం/కనిష్టం **29.9 /21.6**

వాతావరణం

జిల్లాలో మంగళవారం 22.6 - 38.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

16న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్ : జాతీయ న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. మరింత సమాచారం కోసం సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 08562-258622, 244622. ఈమెయిల్ అడ్రస్ డిస్ట్రిక్ట్ డాట్ ఈ కోర్ట్స్ డాట్ జీవోవి.ఐఎన్/కెఐడీఏపీఎ, డీఎల్ఎస్ఏకెడీపీ అట్‌ది డేటాఫ్ జీమెయిల్ డాట్ కామ్. జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

టెక్నాలజీపై అవగాహన పెంచాలి



ప్రిన్సిపల్ సెక్రటరీ నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న డీఈఓ మర్రెడ్డి అనురాధ

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో పిల్లలకు చదువుతోపాటు టెక్నాలజీపై అవగాహన పెంచాలని విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫ్యూచర్‌స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కడప గాంధీనగర్ స్కూల్‌లో డీఈఓ మర్రెడ్డి అనురాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతిపైన చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం టెక్నాలజీపై అవగాహన కల్పిస్తోందన్నారు. ఇందుకోసం ఇంజినీరింగ్ చదివే విద్యార్థులను ఎంపిక చేసి వారి చేత పిల్లలకు ఐటీ, సాఫ్ట్‌వేర్ స్కిల్స్, రోబోటిక్ వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అభ్యర్థులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని పోలింగ్ స్టేషన్ 87ను కలెక్టర్ విజయరామరాజు మంగళవారం పరిశీలించారు. స్థానిక మూలబాట వీధిలోని ఈ పోలింగ్ స్టేషన్‌లో ఓటర్లకు కల్పించిన సౌకర్యాలను ఆయన పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ ప్రాంతంలోని ఓటర్లతో సౌకర్యాల గురించి మాట్లాడారు. కలెక్టర్ వెంట బద్వేలు ఆర్డీవో ఆకుల వెంకటరమణ, మైదుకూరు తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సవరణలుంటే తెలియజేయండి

రాయచోటి టౌన్ : ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల హాల్ టిక్కెట్లను www.bse.ap.gov.in లో ఉంచామని ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు దేవానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు హాల్ టిక్కెట్లను పరిశీలించి మీడియం లేదా సబ్జెక్టుల్లో ఏమైనా సవరణలు ఉన్నట్లయితే వెంటనే ప్రభుత్వ పరీక్షల సంచాలకులకు తెలియజేయాలని కోరారు.

ఉపాధి జోరు..పని హోరు

- లక్ష్య సాధన దిశగా ఉపాధి హామీ పనులు
- 99 శాతం మేర పనిదినాలు నమోదు
- 2023-24 బడ్జెట్ రూ.333.20 కోట్లు
- మార్చి చివరి నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు

జిల్లాలో ఉపాధి హామీ వివరాలు

యాక్టివ్ జాబ్ కార్డులు	1,96,103
ఇందులో ఉన్న కూలీల సంఖ్య	3,35,291
ప్రస్తుతం పనికి వస్తున్న కుటుంబాలు	1,44,199
ఇందులో పని చేసిన కూలీలు	2,30,199
ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం పనిదినాలు	73.5 లక్షలు
ప్రస్తుతం నమోదైన పనిదినాలు	72.65 లక్షలు
100 రోజులు పనిచేసిన కుటుంబాలు	13,575





పనులను పరిశీలించి సూచనలు చేస్తున్న అధికారులు, సీకే దిన్నె మండలం పాపాసాహెబ్‌పేటలో ఉపాధి పథకం కింద నిర్మించిన సచివాలయ భవనం

కడప సిటీ : పల్లెల్లో కరువు పనికి వెళుతున్నామని ప్రతి ఒక్కరూ పదే పదే చెబుతుంటారు. పంటలు పండినప్పటికీ ఒక నామకరణం లాగా మొదటి నుంచి కరువు పనిగా ఉపాధి హామీకి ముద్ర పడింది. సాధారణంగా ప్రభుత్వం వ్యవసాయ పనులు లేని సమయంలో.. వారి ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చింది. గ్రామాల్లోని వారు నివాసం ఉన్న చోట పని కల్పించి ఆర్థిక పురోగతి సాధించాలన్నదే ఉపాధి హామీ ప్రధాన లక్ష్యం. ఆ దిశగా 18 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కూలీలకు ఓ కల్పతరువుగా ఉపాధి హామీ ఆదుకుంటోంది. అందుకుతోడు ప్రభుత్వం వారికి రావాల్సిన వేతనాలను ఎప్పటికప్పుడు ఖాతాల్లో వేయడంతో ఉపాధి పనికి వచ్చేందుకు వేతన జీవులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో నిర్ణయించిన పనిదినాలు సకాలంలో పూర్తయ్యేందుకు అవకాశం ఏర్పడుతోంది. అంతేకాకుండా నిర్మాణాత్మక పనులను కూడా ఉపాధి హామీలో చేయడం వల్ల పల్లెల్లో మరింత అభివృద్ధి జరుగుతోంది.

ఇంత వరకు ఖర్చు చేసింది రూ.292.80 కోట్లు

2023-24 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పనులకు సంబంధించి వైఎస్సార్ జిల్లాలో రూ. 333.20 కోట్లు కేటాయించారు. ఇందులో వేతన జీవులకు రూ.199.92 కోట్లు కేటాయించగా, ఇప్పటి వరకు రూ.177.86 కోట్లు వేతనాలుగా చెల్లించారు. మెటీరియల్ (నిర్మాణాత్మక పనులు)కు సంబంధించి రూ.133.28 కోట్లు కాగా, ఇందులో రూ.96.66 కోట్లు ఇప్పటి వరకు ఖర్చు చేశారు. ఇక మిగతా పరిపాలన ఖర్చుల కోసం రూ.18.28 కోట్లు ఖర్చయింది. మొత్తం రూ.333.20 కోట్ల బడ్జెట్‌కుగాను ఇంత వరకు రూ.292.80 కోట్లు ఖర్చు చేశారు. మార్చి చివరి నాటికి ఇంకా రూ.40.40 కోట్లు వేతనాలకు, నిర్మాణ పనులకు ఖర్చు చేయాల్సి ఉంది.

13,575 కుటుంబాలకు వంద రోజుల పని

2023-24 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 72,65,323 పనిదినాలు నమోదయ్యాయి. 13,575 కుటుంబాలకు వంద రోజుల పనిదినాలు కల్పించారు. కనీస వేతనం రూ. 272 ఉండగా, లబ్ధి చేకూరుతున్న వేతనం రూ. 245.02గా ఉంది. మొత్తం ఈ ఆర్థిక సంవత్సరంలో 73.5 లక్షలు పనిదినాలు నమోదు కావాల్సి ఉంది. ఇందులో ఇప్పటికి 72.65 లక్షలు పనిదినాలు నమోదయ్యాయి. 99.52 శాతం ప్రగతి సాధించారు. ఇందుకుగాను రూ. 177.86 కోట్లు వేతనాలకు ఖర్చు చేశారు.

పనుల నిర్వహణ ఇలా

ఉపాధి హామీ పథకంలో పనుల నిర్వహణ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉంటోంది. ప్రధానంగా నీటి సంరక్షణ పనులను చేపడతారు. అంటే కండిత కందకాలు, ఫారంపాండ్స్, చెరువుల పునరుద్ధరణ, కాలువల్లో పూడికతీత, ప్లాంటేషన్ పనులు చేస్తారు. అలాగే మెటీరియల్ కింద భవన నిర్మాణ పనులకు సంబంధించి గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్‌మిల్క్ డైరీలు, ఆర్బీకేలు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు, సిమెంటు రోడ్లు తదితర పనులు చేస్తారు. ఈ పనులకు గాను మొత్తం బడ్జెట్ రూ.133.28 కోట్లు కాగా, ఇంత వరకు రూ. 96.66 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేశారు.

72.65 లక్షల పనిదినాలు నమోదు

ఉపాధి హామి పథకంలో ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు ఉన్న సమయాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి 73.50 లక్షల పనిదినాలు నమోదు చేయాల్సి ఉంది. ఇంత వరకు 72.65 లక్షల పనిదినాలు నమోదయ్యాయి. మార్చి 31 నాటికి మిగిలిన పనిదినాలను పూర్తి చేయాల్సి ఉంది. ఈ లక్ష్య సాధన కోసం క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తూ ఉన్నతాధికారులు ముందుకు వెళుతున్నారు. అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసి ప్రస్తుతమున్న రాష్ట్రంలో 5వ స్థానం నుంచి 2, 3 స్థానాలకు జిల్లా చేరుకునేలా కృషి చేస్తున్నారు.

ఉపాధిపై సమీక్షలు



వైఎస్సార్ జిల్లాలో ఉపాధి హామీ పనులపై సమీక్షలు నిర్వహిస్తున్నాం. పనుల వేగవంతానికి సలహాలు, సూచనలు ఇస్తూ అనుకున్న గమ్యాన్ని చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. పనుల విషయంలో ఎవరినీ ఉపేక్షించకుండా సక్రమంగా జరిగేలా చూస్తున్నాం.

– విజయరామరాజు, కలెక్టర్, వైఎస్సార్ జిల్లా

సమష్టి కృషితో లక్ష్యాన్ని పూర్తి చేస్తాం



ప్రస్తుతం ఉపాధి హామీ పనులు గ్రామీణ ప్రాంతాల్లో సక్రమంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 99 శాతం పూర్తయ్యాయి. ఒక్క శాతం పనులు మార్చి 31 నాటికి పూర్తి చేయాల్సి ఉంది. అనుకున్న లక్ష్యాన్ని ఛేదించి రాష్ట్రంలో ఉన్నతమైన స్థానాన్ని పొందేందుకు సమష్టి కృషితో ముందుకు సాగుతాం.

– పి.యదుభూషణరెడ్డి, పీడీ, డ్వామా, కడప

సీఎం జిల్లా పర్యటన వాయిదా

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన వాయిదా పడింది. ఈ నెల 7, 8వ తేదీలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటనకు వస్తున్నారని తొలుత సమాచారం వచ్చింది. సీఎం తన పర్యటనలో పులివెందులలో వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సమాచారం వచ్చినప్పటికీ.. ఏవో కారణాల రీత్యా ఆ కార్యక్రమం వాయిదా పడింది.

నేత్రదానం



మృతురాలి కార్నియాలను అందుకుంటున్న సేవాసమితి బృందం

పులివెందుల రూరల్ : పట్టణంలో ఓ మృతురాలి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. అంకాలమ్మపేటకు చెందిన నల్లబల్లే గంగమ్మ(85) మంగళవారం మృతి చెందారు. ఆమె కుమారుడు నాగభూషణ్‌రెడ్డి, కోడలు నాగమని, మనువరాళ్లు ఉమామల్లేశ్వరి, హేమలు.. మృతురాలి నేత్రదానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృతహస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం ఇచ్చారు. ఆయన టెక్నీషియన్ హరీష్, పట్టణ అధ్యక్షులు రఫీతో కలిసి మృతురాలి నుంచి కార్నియాలను సేకరించారు. అనంతరం హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు ఎవరైనా మరణించినట్లయితే నేత్రదానం చేసేందుకు అంగీకారం తెలిపిన తర్వాత 9966509364, 7093204537లకు సమాచారం అందించాలని కోరారు. అంధత్వంతో బాధపడుతున్న అంధులకు దానం చేయడం ద్వారా చూపు ఇచ్చిన వారవుతారన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు సంబేపల్లె విద్యార్థుల ప్రాజెక్ట్

సంబేపల్లె : సంబేపల్లె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థులు మస్తాన్, రోహిత్‌లు రూపొందించిన రెయిన్‌ఫాల్ డిటెక్టర్ క్రాప్ ప్రొటెక్టర్ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం తొమ్మిదవ తరగతి విద్యార్థులకు ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణ విద్యార్థులలో వ్యవస్థాపక మనస్తత్వాన్ని పెంపొందింపజేసిందన్నారు. అన్నమయ్య జిల్లా నుంచి ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపట్ల విద్యార్థులను, గైడ్ టీచర్ ఓబుల్ రెడ్డిని ప్రధానోపాధ్యాయుడు అభినందించారు. వీరు రూపొందించిన ప్రాజెక్టు స్థానిక వాతావరణ పరిస్థితులను అంచనా వేసి అకాల వర్షాలను గుర్తిస్తుందన్నారు. దీనివల్ల రైతులు, భవన నిర్మాణ కార్మికులు అకాల వర్షాల ద్వారా జరిగే నష్టాల నుంచి తప్పించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, విజయసారధి రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు రవిశంకర్, రామయ్య, ఉమాదేవి, నబీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో పనుల పరిశీలన

కడప కల్చరల్ : రాష్ట్ర శిల్పారామాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి శ్యాం సుందర్‌రెడ్డి మంగళవారం కడప శిల్పారామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన శిల్పారామంలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి సమీక్షించారు. పనుల పర్యవేక్షణ అధికారి వి.శ్రీధర్‌రెడ్డిని ఇతర పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫుట్‌పాత్ ఇరువైపుల పచ్చదనం కనిపించేలా మరిన్ని మొక్కలు నాటాలని సూచించారు. సందర్శకుల ఆనందం కోసం ఇప్పటికే రెండు గజిబో (సిట్టింగ్ షెల్టర్స్)లను సందర్శకులు కూర్చొని భోజనం చేసేందుకు అనుకూలంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఆదివారం శిల్పారామాన్ని సందర్శించే వారికి పచ్చదనంతో స్వాగతం తెలిపేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తమకు వేతనాలు పెంచినందుకు శిల్పారామం హౌస్ కీపింగ్, సెక్యూరిటీ గార్డులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ సీఈఓ శ్యాం సుందర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శిల్పారామం రాష్ట్ర పాలనాధికారి మునిరాజు, ఏఓ శివప్రసాద్‌రెడ్డి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న రాష్ట్ర శిల్పారామాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి శ్యాం సుందర్‌రెడ్డి

ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం



జర్నలిస్టులకు శిక్షణలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న ఎంసీఎంసీ మెంబర్ గుర్రప్ప

కడప సెవెన్‌రోడ్స్ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మీడియా పాత్ర ఎంతో కీలకమని నగర పాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంసీఎంసీ, ఎంసీసీ, ఎన్నికల్లో మీడియా పాత్రపై జర్నలిస్టులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ఎన్నికలని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల్లో ఓటర్లను చైతన్యపరచడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఎన్నికల పరిశీలకులు, వ్యయ పరిశీలకుల లాగే మీడియా కూడా ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను పాటించేలా యాక్టివ్ రోల్ పోషించాలన్నారు. ప్రజలు పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయడానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహకరించాలన్నారు. ఏదైనా వార్తను ప్రచురించే ముందు ఫ్యాక్ట్ చెక్ సరిచూసుకొని ప్రచురించాలని పాత్రికేయులను కోరారు. రాజకీయ ప్రకటనలు సోషల్ మీడియా, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్ లు, సినిమా హాల్లో ప్రకటనలు, ఈ పేపర్లు, రేడియోలలో ముందుగా ఎంసీఎంసీ ద్వారా సర్టిఫై అయిన తర్వాతనే ప్రచురించాలన్నారు. ఎంసీఎంసీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల్లో మీడియా పోషించాల్సిన పాత్రపై ఎంసీఎంసీ మెంబర్ గుర్రప్ప పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పాత్రికేయులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి, ఎంసీఎంసీ మెంబర్ సెక్రటరీ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పీఆర్‌ఓలు మస్తాన్, సునీల్ సాగర్, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ ధనుంజయులు తదితరులు పాల్గొన్నారు.

98.54 శాతం పింఛన్ల పంపిణీ

కడప రూరల్ : జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక కింద పింఛన్ల పంపిణీ ఐదవ రోజైన మంగళవారం 98.54 శాతం నమోదైంది. మొత్తం 2,69,191 పింఛన్లకు గాను రూ 79,61,85,000 నగదును అందజేయాలి. అందులో భాగంగా ఇప్పటి వరకు 2,66,346 పింఛన్లకు రూ.78,78,28,000 అందజేశారు. వలంటీర్ల ద్వారా ఠంచన్‌గా.. శరవేగంగా పింఛన్లను పంపిణీ చేయడం పట్ల అవ్వాతాతలు హర్షం వ్యక్త చేస్తున్నారు. ఇందులో భాగంగా కడపలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖాజీపేట మండలం భూమాయపల్లెకు చెందిన వీరయ్యకు వలంటీర్ విజయలక్ష్మి వృద్ధాప్య పింఛన్ అందజేశారు.



ఆస్పత్రిలో వీరయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

సాంకేతిక విద్య.. బంగారు భవిత

- పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- పదో తరగతి విద్యార్థులకు చక్కటి అవకాశం
- మార్చి చివరకు ముగియనున్న పది పరీక్షలు



కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల

కడప ఎడ్యుకేషన్ : పదో తరగతి విద్యార్హతతో సాంకేతిక విద్యకు పునాది వేసే పాలిసెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు లభిస్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులు ఫిబ్రవరిలోనే పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ ఏడాది వైఎస్సార్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 581 పాఠశాలల్లో 27,858 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. వీరంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు, సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు.

గ్రామీణ విద్యార్థులకు ఉపయుక్తం

గ్రామీణ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంజినీరింగ్ వంటి అత్యున్నత సాంకేతిక చదువులను అందుకోవాలంటే ఎక్కువ ఖర్చుతో కూడుకున్న పని. వీరికి తక్కువ ఖర్చుతో ప్రాథమికంగా సాంకేతిక విద్య లభిస్తే దానిని పునాదిగా చేసుకుని భావి జీవితానికి బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది. దీనికి పాలిటెక్నిక్ కోర్సులు వేదికగా నిలుస్తాయి. పాలిసెట్ ద్వారా పాలటెక్నిక్ కోర్సుల్లో చేరి విలువైన సాంకేతిక విజ్ఞానాన్ని సొంతం చేసుకుని సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు.

కోర్సుల వివరాలు

పాలిటెక్నిక్ కోర్సులను ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్నాయి. ఆయా కళాశాలల్లో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్, మెకానికల్, సివిల్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటి), మెటలర్జికల్ ఇంజినీరింగ్(ఎంఈటి) తదితర కోర్సులు అందుబాటులో ఉంటాయి. జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, వేంపల్లె, సింహాద్రిపురం, జమ్మలమడుగు, మైదుకూరులలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో కడపలో ప్రత్యేకంగా మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఉంది. ఈ కోర్సుకాల వ్యవధి మూడు సంవత్సరాలు. దీనిలో భాగంగా ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకునే శిక్షణ సైతం ఇస్తారు. పాలిసెట్ ఎంట్రన్స్‌లో క్వాలిఫై మార్కులు 35గా నిర్ణయించారు.

ఏప్రిల్ 5లోపు దరఖాస్తు పంపాలి

పాలిసెట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో ఏప్రిల్ 5వ తేదీలోపు పాలిసెట్ అప్లికేషన్ సబ్‌మిట్ చేసుకోవాలి. ఏప్రిల్ 27వ తేదీ పాలిసెట్ పరీక్ష నిర్వహణ ఉంటుంది. మే 25వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు. ఆ తరువాత జూన్ నాలుగో వారంలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

పరీక్ష ఇలా...

పాలిసెట్ పరీక్షను 120 మార్కులకు నిర్వహిస్తారు. వీటిలో గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు ఉంటుంది. పదో తరగతి సిలబస్ ఆధారంగా ఎంట్రన్స్ ఉంటుంది. ఈ ఏడాది మే 10న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష జరుగుతుంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400 పరీక్ష ఫీజు చెల్లించాలి.

ఎన్నో ప్రయోజనాలు

పాలిటెక్నిక్‌లో కోర్సును పూర్తి చేస్తే ఉద్యోగం, ఉపా ధి సులభంగా దొరుకుతుంది. ఈ కళాశాలల్లో ఇటీవల తరచూ ఉద్యోగ మేళాలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కోర్సు చేయడానికి మూడేళ్లకు కేవలం రూ.13 వేలు ఖర్చవుతుంది. ఆ తర్వాత ఇంజినీరింగ్ సెకండియర్‌లో చేరవచ్చు. లేదా ఉద్యోగానికి ప్రయత్నించవచ్చు.

ఉద్యోగ అవకాశాలు



పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ చేస్తే చిన్న వయసులోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఉన్నత విద్యతోపాటు స్వయం ఉపాధికి తోడ్పడుతుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సీహెచ్ జ్యోతి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, కడప

క్లుప్తంగా

ఆకేపాటి ఇంట పెళ్లి సందడి



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ప్రసాద్‌రెడ్డి తదితరులు

రాజంపేట రూరల్ : జెడ్పీ చైర్మన్, రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి సోదరుడు సీనియర్ నాయకులు ఆకెపాటి అనిల్‌కుమార్‌రెడ్డి కుమారుడు ఆకెపాటి పాటి సాయిఅఖిల్‌రెడ్డి, అంజలారెడ్డిల వివాహ వేడుకలు తిరుపతిలో వైభవంగా నిర్వహించారు. మంగళవారం మండలంలోని ఆకేపాటి ఎస్టేట్‌లో రిసెప్షన్ వేడుక జరిగింది. ఉమ్మడి జిల్లాల్లోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, సిబ్బంది వేల సంఖ్యలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. వందల కొద్దీ వాహనాలు రావడంతో ఆకేపాడులో పెళ్లిసందడి కనిపించింది. ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా, శాసన సభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి, పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, మేడా వెంకటమల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, డాక్టర్ సుధ, కడప మేయర్ కొత్తమద్ది సురేష్‌బాబు, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, జీఎన్ నాయుడు, పత్తిపాటి కుసుమకుమారి, సాయిలోకేష్, తదితరులు పాల్గొన్నారు.

సపోట, మామిడి తోటలు బుగ్గి

సంబేపల్లె : మండలంలోని మోటకట్ల గ్రామం, జానం వాండ్లపల్లెకు చెందిన రైతు వేణుగోపాల్ సాగు చేసిన సపోట, మామిడి ఉద్యాన తోటకు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలి బుగ్గి అయ్యాయి. నాలుగేళ్లు కంటికి రెప్పలా కాపాడుకున్న పంట కాలిపోవడంతో దాదాపు లక్ష రూపాయలకు పైగా నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు. ప్రభుత్వం జరిగిన నష్టాన్ని పరిశీలించి ఆదుకోవాలని రైతు కోరుతున్నారు.

కాళహస్తిలో.. కన్నప్పకే తొలిపూజ

భక్త జన కోరికలు తీర్చే కొంగుబంగారం భోళా శంకరుడు. సమస్త జగానికి లయకారుడు పరమ శివుడే అని భక్తజనకోటి మొక్కుతారు. ఇంతటి మహిమాన్వితుడిని కొలిచే వారిలో ఒక్కడైన భక్తుడు భక్తకన్నప్ప. రాజంపేట మండలం ఊటుకూరు వాసి భక్త కన్నప్పకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో జరిగే బ్రహ్మోత్సవాలలో తొలి పూజలు చేస్తున్నారంటే ఆయన భక్తి ఏపాటిదో అర్థమవుతోంది. ఈ సందర్భంగా భక్త కన్నప్పపై సాక్షి ప్రత్యేక కథనం.

- భక్త కన్నప్ప ధ్వజారోహణతోనే ఉత్సవాలు ఆరంభం
- స్వస్థలం ఊటుకూరు ఆలయంలోనూ పూజలు



కన్నప్ప పూజించిన శివాలయం ఇదే



భక్త కన్నప్ప విగ్రహం

రాజంపేట : మహిమాన్వితుడు శివుడి అనుగ్రహం పొందిన భక్త కన్నప్ప పూర్వం కణ్ణడు అనే కోయవాడు. దివ్య కైలాస శిఖరారణ్యంలో తిరుగుతూ వాయు లింగానికి బిల్వదళాలతో నిత్యపూజ చేసి వేటాడి తెచ్చిన జంతు మాంసాన్ని నైవేద్యంగా సమర్పించేవాడు. ఒక రోజు ఇతడి భక్తికి పరీక్ష పెట్టేందుకు ఆ మహాశివుడు కణ్ణడు పుక్కిట జలంతో అభిషేకిస్తున్న సమయంలో శివలింగం కంట నీరు కారే విధంగా చేశాడు. ఇది గమనించిన కణ్ణడు తన తప్పిదం వల్లే అలా జరిగిందని భావించాడు. అమ్ముల పొదిలో బాణం తీసి తన కన్ను శివలింగానికి అమర్చాడు. మరో కన్ను తీస్తుండగా పరవశించిపోయిన శివుడు ప్రత్యక్షమై కన్నప్పకు మోక్షం ప్రసాదిస్తాడు. నిన్ను దర్శించినా, చరిత్ర విన్నా..పఠించినా సర్వ పాపాలు తొలిగి అంత్య కాలంలో కైలాస ప్రాప్తి పొందుతారని పలికి అంతర్ధానమవుతాడు. నాటి నుంచి భక్త కన్నప్పకు స్వామికన్నా ముందే తొలిపూజ చేయడం ఆచారంగా వస్తోంది. యేటా బ్రహ్మోత్సవాల సమయంలోనూ భక్త కన్నప్ప కొండపై తొలుత ధ్వజా రోహణం చేసిన తర్వాత మరుసటిరోజు స్వామి ఆలయంలో ధ్వజారోహణ చేసి బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తారు.

కన్నప్ప పుట్టిన ఊరు ఎక్కడ..

రాజంపేట పట్టణం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో కడప-రేణిగుంట జాతీయ రహదారిలో భక్త కన్నప్ప జన్మస్థలమైన ఊటుకూరు ఉంది. కన్నప్ప తండ్రి నాగుడు, తల్లి తంచె. ద్వాపరయుగంలో అర్జునుడు శివుడితో యుద్ధం చేసి పాశుపతాస్త్రం సంపాదించిన అనంతరం, మోక్షం పొందేందుకు కలియుగంలో తిన్నడు (కన్నప్ప)గా ఉడుమూరు నందు జన్మించారు. కాలక్రమంలో ఉడుమూరు ఊటుకూరుగా మారింది. ఇక్కడే కన్నప్ప ప్రతిష్టించిన శివలింగం ఉన్న పురాతన ఆలయం ఉంది. తిరుపతి, చెన్నైకు వెళ్లే ఏ వాహనంలోనైనా ఊటుకూరు(ఉడుమూరు)కు చేరుకోవచ్చు. తమిళనాడుకు చెందిన ఓ భక్తుడు పెరియ పురాణం ద్వారా భక్త కన్నప్ప జన్మస్థలం ఊటుకూరు అని వెలుగులోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి గ్రామస్తులు దాతల సహకారంతో ఆలయాభివృద్ధికి నడుం బిగించారు.

గుర్తింపు కోసం ఎదురుచూపు..

తిన్నడు(కన్నప్ప) ఒకనాడు అడవిలో పందిని వేటాడుతూ ఊటుకూరు నుంచి అటవీ ప్రాంతంలో స్వర్ణముఖినది వరకు వెళ్లాడు. అక్కడ నేటి శ్రీకాళహస్తి దగ్గర శివలింగాన్ని దర్శించి పూజలు చేసేవారు. తర్వాత పరమశివునికి తన రెండు కళ్లను సమర్పించి భక్తిని చాటుకున్నారు. ఆయన భక్తికి మెచ్చి శివుడు కన్నప్పకి మోక్షమిచ్చారు. రాజంపేట నియోజకవర్గంలో భక్త కన్నప్ప జన్మస్థలం గుర్తింపు కోసం ప్రభుత్వం నుంచి అనుమతులు ఎప్పుడు వస్తాయని ఆ ప్రాంతీయులు ఎదురు చూస్తున్నారు. స్థలం అభివృద్ధి సహకరించాలని గతంలో శ్రీకాళహస్తి దేవస్థానం దృష్టికి తీసుకెళ్లిన సంగతి విదితమే.

అన్నమయ్యతో అనుబంధం..

తాళ్లపాక అన్నమాచార్యులు తాత నారాయణయ్య చదువుకోవడానికి ఊటుకూరు (ఉడుమూరు)కు వచ్చారు. గురువు పెట్టే శిక్షలు భరించలేక చింతాలమ్మ గుడిలోని పుట్టలో చేయిపెట్టారు. పాము కరవలేదు కానీ, చింతాలమ్మ ప్రత్యక్షమై వేంకటేశ్వరుని అనుగ్రహం వల్ల నీవు మానవుడిగా పుడతావని ఆశీర్వదించింది. ఆ నారాయణయ్య మనువడే అన్నమాచార్యులు. అన్నమయ్య తండ్రి నారాయణసూరి, తల్లి లక్కమాంబ. ఊటుకూరు నందు చిన్నతనంలో విద్యాభ్యాసం చేశాడు. కలియుగ దైవం వేంకటేశ్వరుడిపై 32 వేల కీర్తనలు రచించి, పదకవితా పితామహుడుగా పేరు తెచ్చుకొని ధన్యుడయ్యారు. చింతాలమ్మ అమ్మవారి విగ్రహం ఇప్పటికీ ఊటుకూరు శివాలయంలో ఉంది.

కన్నప్ప నడియాడిన ప్రదేశం ఊటుకూరు



గ్రామంలో కన్నప్ప పూజించిన శివాలయం ఉంది. ఊటుకూరు పరిసర ప్రాంతాలు కన్నప్ప నడియాడిన ప్రాంతం. తమిళ భక్తులు కన్నప్ప జన్మస్థలం ఊటుకూరు అని వెలుగులోకి తీసుకొచ్చారు. భక్త కన్నప్పకు శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలలో తొలి పూజ చేయడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయం.

-నాగా పృథ్వీపతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత, ఊటుకూరు

కన్నప్ప జన్మస్థలంలో ఉండటం పూర్వజన్మసుకృతం



భక్త కన్నప్ప జన్మస్థలంలో జన్మించడం పూర్వజన్మసుకృతం. కన్నప్ప ఇక్కడి వాడేనని అన్ని విధాలుగా చరిత్రాత్మక ఆధారాలున్నాయి. శ్రీకాళహస్తికి అటవీ మార్గంలో చేరుకున్నారు. శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలో తొలిపూజ తమ గ్రామానికి చెందిన భక్తకన్నప్పకు అంటే తమలో ఎక్కడలేని భక్తి ఉప్పొంగి వస్తుంది.

-రేవరాజు శ్రీనివాసరాజు, ఎంపీటీసీ, ఊటుకూరు



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు-నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

-సాక్షి నెట్‌వర్క్

నాడు-నేడుతో విద్యాభివృద్ధి



గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చేసి విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారు. ఓ వైపు పాఠశాలల్లో వసతులు, మరో వైపు విద్యార్థులకు అవసరమైన సామగ్రి సకాలంలో అందిస్తుండడంతో కార్పొరేట్ స్థాయి విద్య అందుతోంది. గతం కంటే ఫలితాలు మెరుగు పడ్డాయి. అందుకే ప్రైవేట్ పాఠశాలలో చదివే నా కుమార్తె మదీనాను 8వ తరగతి నుంచి జడ్పీ గరల్స్ హైస్కూల్‌లో చేర్పించాను. ప్రభుత్వ పాఠశాలల్లో ఇన్ని వసతులు కల్పించిన జగనన్నకు కృతజ్ఞతలు.

-పి.రహంతుల్లా, కమలాపురం

సొంతింటి కల నెరవేరింది



గతంలో మాకు సొంత ఇల్లు లేకపోవడంతో బాడుగ ఇంట్లో ఉండేవాళ్లం. అద్దె డబ్బులు చెల్లించేందుకు నానా ఇబ్బందులు పడేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఇంటి స్థలంతో పాటు పక్కా గృహం కూడా మంజూరు కావడం ఆనందంగా ఉంది. సొంతింటి కల నెరవేర్చిన సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

-సుధారాణి. ములకలచెరువు, అన్నమయ్య జిల్లా

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ చరిత్రాత్మకం



తమ లాంటి నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించడం చరిత్రాత్మకం. భవిష్యత్తులో మాకు కలిగే ఉపయోగాలను ఆయన వివరించారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఇప్పటికే ఇంటి పట్టా రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేయించారు. దేవుడులా మాలాంటి నిరుపేదలను సీఎం జగన్ ఆదుకుంటున్నారు.

- ఎస్.జరీనాబేగం, జెండామానువీధి, చిన్నమండెం

వేర్వేరు ప్రమాదాల్లో ఒకరు మృతి

మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన సుబ్రహ్మణ్యం ఆచారి

ఎర్రగుంట్ల : మండలంలోని పోట్లదుర్తి సమీపాన పెన్నానది ఒడ్డున ట్రాక్టర్ ఢీకొని కొవెలగుంట్ల సుబ్రహ్మణ్యం ఆచారి (62) దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎర్రగుంట్ల ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు పోట్లదుర్తి గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం ఆచారి ప్రొద్దుటూరులో పని ముగించుకుని తిరిగి వస్తున్నాడు. పెన్నానది ఒడ్డున స్కూటర్ పక్కకు నిలిపి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో యర్రగుంట్ల వైపు నుంచి వస్తున్న నాపరాయి రాళ్ల ట్రాక్టర్ సుబ్రహ్మణ్యం ఆచారిని ఢీకొంది. ప్రమాదంలో ఆచారి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండ్లిమర్రి : కడప-పులివెందుల ప్రధాన రహదారిలోని పెండ్లిమర్రి వద్ద మంగళవారం రాత్రి బొలెరో క్యాపర్... ద్విచక్ర వాహనదారుడిని ఢీకొన్న సంఘటనలో చెర్లోపల్లె గ్రామానికి చెందిన జి.లక్ష్మిరెడ్డికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... వేంపల్లె నుంచి కడప వైపు వెళ్తున్న బొలెరో క్యాపర్.. సమీపంలో ద్విచక్ర వాహనంలో రోడ్డు దాటుతున్న లక్ష్మిరెడ్డిని అదుపు తప్పి ఢీకొంది. అతనికి త్రీవ గాయాలవడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంబేపల్లె : చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై గుట్టపల్లె సమీపంలో మంగళవారం స్కూటర్‌ను ఐచర్ వాహనం ఢీ కొనడంతో ముబారక్ బాషా అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా యడమర్రి మండలానికి చెందిన ముబారక్ బాషా ద్విచక్ర వాహనంపై వ్యాపారాలు చేసుకుంటూ జీవించేవాడు. మంగళవారం వ్యాపారం ముగించుకొని రాయచోటి నుండి పీలేరు వైపు వెళ్తుండగా రాయచోటికి వస్తున్న ఐచర్ వాహనం ఢీ కొంది. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొలతలలో ఉత్సవాలకు ఏర్పాట్లు

జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



పొలతలలో ఉత్సవాలపై అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలంలోని పొలతల శైవ క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించే ఉత్సవాలకు పటిష్టమైన బందో బస్తు ఏర్పాటుచేయాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సూచించారు. పొలతల క్షేత్రంలో ఉత్సవాలకు జరిగే ఏర్పాట్లను ఎస్పీ మంగళవారం పరిశీలించారు. వాహనాల పార్కింగ్ ప్రదేశం, క్యూలైన్లు, కోనేర్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీసులు, ఆలయ సిబ్బందికి ఎస్పీ సూచించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు తాగునీటి వసతి ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎం.డి షరీఫ్, డి.టీ.సీ.డి. డీఎస్పీ రవికుమార్, సీఐ నాగరాజు, ఆలయ చైర్మన్ నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనువాసులు, ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

రామాపురం : మండలంలోని రాచపల్లె పంచాయితీ బాలిరెడ్డిగారిపల్లె తూర్పు భాగంలోని ముళ్ల పొదల మధ్య జూదం ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ49,750లు నగదు స్వాధీన పరుచుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అపహరణ కేసు నమోదు

రామసముద్రం : ముగ్గురు వ్యక్తులపై యువతి అపహరణ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని రామసముద్రం గ్రామం దిగువ హరిజనవాడకు చెందిన అమ్మాయిని ఫిబ్రవరి 25న ముగ్గురు వ్యక్తులు భయపెట్టి అపహరించారు. అమ్మాయిని నిర్బంధించి తన బంధువు సుదర్శన్‌ను పెళ్లి చేసుకోకపోతే చంపుతామని బెదిరించారని బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేశాడని ఎస్సై తెలిపారు. వారి బారి నుంచి తప్పించుకుని తండ్రి వద్దకు చేరుకున్న అమ్మాయి విషయం చెప్పగా పెద్దలతో పరిష్కరించుకుందామని చూశాడన్నారు. అయితే సుదర్శన్, మణి, ప్రశాంత్‌లు తరచూ ఇబ్బంది పెడుతుండడంతో ఫిర్యాదు చేశారని, ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో వంద కుటుంబాల చేరిక

కండువా కప్పి చేర్చుకున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి




వెంకటసుబ్బయ్య కాలనీ వాసులతో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, శెట్టిపల్లె నాగిరెడ్డి

మైదుకూరు : పట్టణంలోని వెంకటసుబ్బయ్య కాలనీలోని వంద కుటుంబాల జనం మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలో చేర్చుకున్నారు. ముందుగా కాలనీకి చేరుకున్న ఎమ్మెల్యే, ఆయన తనయుడు శెట్టిపల్లె నాగిరెడ్డిలకు స్థానికులు మేళ తాళాలు, పుష్పాలతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు పేదలకు ఏమీ చేయలేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి రూ.3వేల పింఛన్‌త పాటు కాలనీలో అర్హులైన వారికి ఆసరా, చేయూత, విద్యా దీవెన, అమ్మఒడి పథకాలను అందించారని వివరించారు. గతంలో కాలనీకి రావాలంటే గతుకుల రోడ్డుపై ఇబ్బందిగా పడేవారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.3 కోట్లతో కాలనీ మీదుగా నానుబాలపల్లె వరకు తారు రోడ్డు వేసి సమస్య పరిష్కరించామన్నారు. రూ.12 లక్షలతో కాలనీకి ఇరు వైపులా సీసీ రోడ్డు వేశామని తెలిపారు. అనంతరం స్థానిక రామాలయం అభివృద్ధికి రూ.2 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఎం.వెంకటసుబ్బయ్య, వార్డు ఇన్‌చార్జి సొద్దల సురేష్‌బాబు, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, కూశెట్టి రాయుడు, షరీఫ్, ట్రాక్టర్ గౌస్, అన్నలూరు శ్రీను, పీవీ రమణారెడ్డి, సుధాకర్, వెంకటేష్, ఖాదర్, నాయబ్ రసూల్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సోలార్ వెలుగులు

- కేంద్ర ప్రభుత్వ సరికొత్త పథకం
- ప్రతి ఇంటికి 300 యూనిట్ల ఉచిత విద్యుత్
- ఇంటి యజమానుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : సౌర శక్తితో ఇంటింటా వెలుగులు నిండనున్నాయి. ఉచిత విద్యుత్తుతో ప్రతి ఇల్లు దేదీప్యమానంగా కాంతులీననుంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రతి ఇంటికి సోలార్ ప్లేట్లను సరఫరా చేయడం ద్వారా 300 యూనిట్ల వరకూ ఉచిత కరెంట్ పొందే అవకాశం కల్పించనుంది. కేంద్ర ప్రభుత్వ ఈ పథకంపై తపాలా శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు కడప డివిజనల్ పోస్టల్ సూపరింటెండ్ రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

దరఖాస్తు చేసుకోవాలిలా..

సౌరశక్తిని ఉపయోగించి విద్యుత్ బిల్లులు ఆదా చేయాలనుకునే వారు కేంద్ర ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. తమ దగ్గరలోని తపాలా శాఖ కార్యాలయాలకు వెళ్లి పోస్ట్‌మాస్టర్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలి. 1 కేడబ్ల్యూ పైకప్పునకు సాధారణంగా 8-10 చ.మీ నీడలేని ప్రాంతం అవసరం. వినియోగదారుడు సెల్ ఫోన్ కచ్చింతగా కలిగి ఉండాలి. ఇంటికి ఆర్‌సీసీ స్లాబ్ ఉండాలి. తగినంత లోడ్ బేరింగ్ సామర్థ్యం ఉన్న ఏ రకమైన పై కప్పుపై అయినా సౌర పీవీ వ్యవస్థను ఏర్పాచపటు చేసుకోవచ్చు. ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు 1కెడబ్ల్యూ సౌర విద్యుత్ కేంద్ర ఒక రోజులో 4-4.45 యూనిట్ల ఉత్పత్తి చేస్తుంది. సోలార్ ప్యానల్ ప్రామాణిక జీవిత కాలం 25 ఏళ్లు ఉంటుంది. సౌర విద్యుత్ ప్యానల్ కొనుగోలు విషయంలో డిస్కం నిర్ణయించిన ధరల ప్రకారం ముందుగానే వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుంది.

సౌరశక్తిపై సబ్సిడీ వివరాలు ఇలా ఉన్నాయి...

యూనిట్లు	సామర్థ్యం	అంచనా మొత్తం	సబ్సిడీ
0-150	1-2 కెడబ్ల్యూ	రూ.55వేలు నుంచి రూ.65 వేలు	రూ.30 నుంచి 60వేలు
150-300	2-3 కెడబ్ల్యూ	రూ.లక్ష నుంచి రూ.1.15 లక్షలు	రూ.60 వేల నుంచి రూ.78 వేలు
300 ఆపైన	రూ.1.40 లక్షల నుంచి రూ.4.60 లక్షలు		

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఆసక్తి గల వినియోగదారులు సమీపంలోని తపాలా శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను పరిశీలించి వారికి అవసరమయ్యే సోలార్ వెలుగులను అందిస్తాం.

జి.రాజేష్, కడప డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్

నిత్యపూజ కోనలో భారీ బందోబస్తు



నిత్యపూజ కోనను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ

సిద్దవటం : నిత్యపూజ స్వామి కోనలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు నిత్యపూజ స్వామి కోనలకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకునేందుకు మంగళవారం ఆ స్థలాన్ని పరిశీలించామన్నారు. ఈ నెల 7, 8, 9వ తేదీలలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా టూవీలర్, ఫోర్‌వీల్ వాహనాలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి సమస్యలు లేకుండా భద్రత, మొబైల్ పోలీసు బందోబస్తు ఏర్పాటుకు పరిశీలిస్తున్నామని తెలిపారు. కొండపై దేవుడి దర్శనార్థం భక్తులు క్యూలైన్‌లో వెళ్లి పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, ఎస్‌ఐ పెద్ద ఓబన్న, లక్ష్మిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

ఉర్దూ మాధ్యమంతో ఉపాధి అవకాశాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆచార్యులు

వైవీయూ : ఉర్దూ మాధ్యమం చదివే వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని వైవీయూ పీజీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఆచార్య పి.ఎస్ షావల్లి ఖాన్ అన్నారు. వైవీయూలోని హ్యూమానిటీస్ బ్లాక్‌లో ఉర్దూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉర్దూ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా షావల్లి ఖాన్ మాట్లాడుతూ ఉర్దూను అభ్యసించే వారికి వేమన విశ్వవిద్యాలయం ఒక చక్కటి వేదిక అన్నారు. ఉర్దూ శాఖ అభివృద్ధికి అందరి సహకారం ఉందని, డిగ్రీ కాలేజీ లెక్చరర్స్, జూనియర్ కాలేజ్, ఏపీపీఎస్సీ యూపీఎస్సీ వంటి పరీక్షలు రాసి ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చన్నారు. ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ఆచార్య తప్పెట రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ అరబిక్, పర్షియన్, తుర్కీ భాషల నుంచి ఉర్దూ భాష పుట్టిందన్నారు. స్వాతంత్ర పోరాటంలో ఉర్దూ భాష క్రియాశీలక పాత్ర పోషించిందని ఉదహరించారు. చరిత్రశాఖ ఆచార్యులు కంకణాల గంగయ్య మాట్లాడుతూ మధ్యయుగంలో ఉర్దూ ప్రాధాన్యం పెరిగిందని చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ చరిత్ర, సంస్కృతి, మానవ సంబంధాలు, సమాచారం చేరవేసేందుకు భాష అవసరమన్నారు. 17 నుంచి19 శతాబ్దాల్లో ఉర్దూ భాష అభివృద్ధి జరిగిందని, ఉర్దూ భాష ఇతర భాషల్లో కలిసిపోయిందని వివరించారు. ఉర్దూ శాఖ అధిపతి ఆచార్య కె. రియాజున్నిసా మాట్లాడుతూ క్రమక్రమంగా ఉర్దూ భాష విలువ ప్రాముఖ్యత పెరుగుతోందన్నారు. అనంతరం ఉర్దూ భాషా దినోత్సవం సందర్భంగా పలు పోటీలు నిర్వహించి విజేతలకు అతిథులు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో చరిత్రశాఖ ఆచార్యులు డా.కె గంగయ్య, తెలుగు శాఖ ఆచార్యులు పి.రమాదేవి, పార్వతి, ఉర్దూ శాఖ అధ్యాపకులు డా ఖాజా పీర్, సర్దార్ ఖాజమైనుద్దీన్, డాక్టర్ నజీమున్నీసా, రెహనా పర్వీన్, సయ్యద్ ఇంతియాజ్ అహ్మద్, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.